నీరజకి పేర్లు పెట్టటం చాలా ఇష్టం. 'పేర్లుపెట్టటం' అంటే నిక్‌నేమ్స్ కానేకాదు. పుట్టినపిల్లలకి పేర్లు సెలక్ట్‌చేసి పెట్టటం ఆమెకిష్టం. 'ఇష్టం' ... అని మర్యాదగానూ, 'పిచ్చి' అని కొంచెం మోటుగానూ అనవచ్చు. అసలా అమ్మాయికి ఆ పిచ్చి ఎలా పట్టిందో చెప్పటం కష్టం.

ఆ సంగతి ఆ అమ్మాయికే తెలీదు. అడిగితే, "అది నా హాబీ" అంటుంది గర్వంగా. అన్ని ఫీల్డులూ అనుకోనివిధంగా అడ్వాన్స్ అయిపోతున్న ఈ ప్రపంచంలో 'ఇంజనీరింగ్ కన్సెల్టెన్సీ', 'మ్యారేజ్ కౌన్సిలింగ్' లాగా Naming Consultancy అనో లేదా 'క్రిసెనింగ్ కన్సెల్టెన్సీ' ఏర్పడాలనీ, అది మొదటిసారిగా స్థాపించిన ఘనత తనకే దక్కాలనీ కలలుగూడా కంటుండేది పాపం.

"నీకేమైనా పిచ్చా? పేరు పెట్టుకోటానికింత రాద్ధాంతమా?" అని ఎవరన్నా అడిగారో ... చాలు ... "అదే వద్దంటాను. పేరులో ఏవుందీ అని తీసిపారేస్తారు ... పేరులోనే వున్నది గదా! చుట్టాలు దగ్గర్నించీ, పరిచయస్తులదాకా పేరే గుర్తుంచుకుంటారు. మంచి పేరుంటే మనిషిని చూడకుండానే అదోరకం మంచి ఫీలింగ్ వస్తుంది. మనిషి ఎంత గొప్పైనా 'కలెక్టర్ వెంకాయమ్మ' అంటే ఏం బావుంటుందీ? అసలుపేరు పెట్టేందుకు చాలా ఆలోచనా అన్నిట్నీ మించి టేస్ట్ ... టేస్ట్ ... కావాలి" ఇలా సాగదీస్తుంది లెక్చర్.

ఎవరికైనా పిల్లలు పుట్టారంటే, వాళ్ళు పరిచయస్తులైనా కాకపోయినా, ఎలాగోలా ఏం పేరు పెట్టారో తెల్సుకుంటేగానీ ఆమెకి తోచేదికాదు. ఆ పేర్లు తెల్సుకున్నాక, 'బావుందే' అనో, "ఆ! తేలిపోయింది" అనో, "అసలిలాంటి చెత్తపేర్లెలా పెడతారో" ఇలా కాటగరైజ్ చేస్కుని తన్లో తను తృప్తిపడుతుండేది.

చిన్నతనంలో హైస్కూల్లో చదువుతుండగానే మంచి పేర్లన్నీ లిస్ట్ రాయటం ప్రారంభించింది నీరజ. 'నీరజా ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ నేమ్స్' అనో పుస్తకం రావాలని ఆమె కోరిక. ఆ పుస్తకానికి మంచి అట్టా, దానిమీద అందమైన అక్షరాల్తో తన పేరు ఊహించుకోటం గూడా అయిపోయింది.

# పేరులోనేవున్నది



డా. రాధికామూర్తి

'ఆర్నెల్ల సావాసం' సామెతలాగా నీరజ అలవాటు స్నేహితురాలు ఉమకీ బాగా అంటుకుంది. ఇద్దరూ కూర్చుని ఆటల పీరియడ్‌లోనూ, క్రాఫ్ట్‌వర్క్ అవర్లోనూ పేర్లలిస్టులు ఆల్ఫాబెటికల్ ఆర్డర్లో తయారుచేసేవాళ్ళు.

నీరజ ఇంట్లో ఈ సంగతీ, లిస్టులూ చూసినా, ఆ అమ్మాయి చదువులో ఎపుడూ ఫస్ట్‌రాంకుల్లో వుండేది కావటంవల్ల ఎవరూ ఏమీ పట్టించుకునేవారుకాదు. నిజమే మరి, దాన్లో ఒకళ్ళకొచ్చిన నష్టం ఏముంది గనకా?

బంధుబలగాల్లో ఎవరికైనా పిల్లలు పుట్టినా, పుట్టబోతున్నా నీరజకి చాలా ఆనందం వేసేది. ఆమె మేనత్తలు, పిన్నమ్మలు చాలామంది ఇంటికి వస్తూ పోతూండేవారు. 'పేరేం పెడతారత్తా?' అని తప్పకుండా అడిగేది. "ఏమోనే! నువ్వేదైనా మంచిపేరు చెప్పు" అనేవాళ్ళు వాళ్ళు యథాలాపంగా. వెంటనే పొంగిపోయి తన లిస్టు తెచ్చి వాళ్ళముందుంచేది. వాళ్ళు ఆశ్చర్యపోయి, 'వీటిలో ఎంచుకుని నీకు రాస్తాలే!' అనో, "పుట్టాక చూస్తాలే, వీటిల్లో ఓ 'పేరు' అంటూ దాటేసేవాళ్ళు. ఆ మాత్రానికే చాలా ఆనందపడి గర్వపడేది పాపం నీరజ. కానీ ఆ ఆనందం ఎన్నాళ్ళో నిలిచేది కాదు. 'నువు చెప్పిన పేరు

పెడతాం' అని వెళ్ళినవాళ్ళు అవేవీ కాకుండా ఏవో పేర్లు పెట్టుకునేవాళ్ళు. అదేమనడిగితే, "ఏం చెప్పను నీరూ! ఆఖరి నిమిషంలో మావారికేదీ నచ్చలేదు" అనో "అదీ పెట్టేదాన్నేగానీ, మా అత్తగారి పేరు కలపటానికి కుదర్లేదు" అంటూ సాకులు చెప్పేవాళ్ళు. మొదట్లో నిజమని నమ్మినా నీరజకి తెలిసిపోయింది. అవేం కారణాలు కావని. ఎందుకో అర్థమయ్యేది కాదు ఆమెకి. అప్పట్నించీ పిలవని పేరంటం ఎందుకని, "పేరు నేను చెప్పనా?" అనడగటం మానుకుందామె.

వీళ్ళందరితో ఎందుకుగానీ తన అక్కే వుండటంతో నీరజ పెద్దగా బాధపళ్ళేదు. తన క్రియేటివ్ కన్సెల్టన్సీ పేర్లు ఇంప్లిమెంట్ కావటానికి అక్క పిల్లలు మంచి అవకాశం. నీరజ తన అక్క గర్భవతి అని తెలియగానే చాలా ఆనందపడిపోయింది.

అక్క, బావలతో పుట్టబోయే పాపాయి పేరు పెట్టటం తనకి వదిలెయ్యమని చెప్పేసింది కూడా. నీరజ పిచ్చి తెలిసిన ఆమె అక్క నవ్వేసి "సరే, అలాగే కానీ" అని హామీ ఇవ్వటంతోపాటు "చూడూ! మరీ అల్ట్రామోడర్న్ పేర్లు, అర్థంపర్థంలేనివీ నాకొద్దు. సింపుల్‌గానూ, స్టైయిల్‌గానూ కూడా వుండాలి. సహజంగా వుండాలి" అనో వార్నింగ్ కూడా ఇచ్చింది.

ఓ శుభముహూర్తంలో నీరజ అక్కకి కొడుకు పుట్టాడు. కిరణ్ అనీ, శేఖర్ అనీ ఏవేవో పేర్లు పాపం చాలానే రాసి పంపింది నీరజ. తిరుగుటపాలో పేర్ల ప్రసక్తి లేదుగానీ బాలసాలకి రమ్మని పిలుపొచ్చింది నీరజకి. పెట్టకేం చేస్తారని ధీమాగా వాళ్ళవూరెళ్ళిన నీరజకి షాక్ తగిలింది. పేరు ఏదో ... తను చెప్పింది మాత్రం కాదు. నీరజకి చాలా కోపం వచ్చింది. చివరికి తన అక్క కూడా ఇలా మోసం! ముందు సరేననటం, పేరు చెప్పమని అడగటం ఇవన్నీ దేనికసలు? ... కనీసం ఎందుకు పెట్టలేదో నీరజకి అడగబుద్ధికాలేదు. పిల్లవాడి నక్షత్రం పేరు అదీ ఇదీ ఏవో కలపాలని పెద్దవాళ్ళు పట్టుపట్టారట తర్వాత తెలిసింది.

దీనితో నీరజ పేర్లు సజెస్ట్ చేసే అలవాటు



చిత్రం: పి. నారాయణ రావు
తెనాలి.

పూర్తిగా మానుకుంది. అయినా ఆమె లోలోపల్లో ఆ సరదా చావలేదు. ఆమెకిపుడు మిగిలింది ఒకటే ఆశ. "సరే! నాకు పిల్లలు పుట్టకపోతారా? పేర్లు పెట్టటానికి అపుడెవరడ్డొస్తారో చూస్తాము" అనుకునేది ధీమాగా. చదువులోపడి ఆ సంగతి మర్చిపోయింది నీరజ. ఇన్ని అనుభవాల తర్వాత కొన్నేళ్ళకి నీరజకి పెళ్ళైపోయింది...

పేర్ల పిచ్చి మళ్ళీ మొదలైందామెకి. ఎక్కడన్నా కొత్తదీ, తనకి నచ్చిందీ పేరు కనపడటమో, లేక తనే ఓ కొత్త పేరు సృష్టించటమో చేసి వెంటనే భర్తకి చెప్పి "ఎలా వుందీ పేరు?" అనడిగేది. అతనికిదేం కొత్తలో అర్థం కాలేదు. ఏదో ఒకటి చెప్పేవాడు. అతని అనాసక్తి గమనించినా నీరజ "తనకంత పెద్ద ఇంట్రెస్ట్ లేదేమో" అని సచ్చచెప్పుకునేది.

ఒకరోజు కబుర్లలో నీరజ తన హాబీ గురించీ, పేర్లు సెలక్ట్ చెయటంలో, కొత్తవి కనిపెట్టటంలో తన ప్రయత్నాల గురించీ, అయితే తన ఫెయిల్యూర్స్ ... తన సలహాలెవరూ వినకపోవటం గురించీ కూడా దీర్ఘంగా చెప్పకొచ్చింది... "ఇపుడు హాయిగా మన పిల్లలకి నేను పేర్లు పెడతాను చూడండీ ... అంతా ఆశ్చర్యపోతారు ... వాళ్ళనీ వీళ్ళనీ బ్రతిమాలవలసిన అవసరం నాకేవిటీ" అని కూడా అంది. అక్కడికి పుట్టే పిల్లలకి పేర్లు పెట్టటమే తన జీవితాశయం అయిపోయినట్టు.

అదంతా విని నీరజ హాబీకున్న తీవ్రతకి ఆశ్చర్యపోయాడామె భర్త మూర్తి. కాస్సేపటికి తేరుకుని ఇలా అన్నాడు ... "చూడ నీరజా! నీకీ హాబీ ఎట్లా పుట్టిందో – పేర్లు పెట్టటం హాబీ కాకూడదు అసలు. పెట్టే పేరులో చాలా అర్థం వుండాలి. ఏదో పిల్చుకునేందుకు కాకుండా ఒక అర్థం, ప్రత్యేకత వుండాలి. అసహజంగా వుండకూడదు. నీకు తెలుసో లేదో, మనం పెట్టే పేర్ల ప్రభావం కూడా పిల్లలమీద అంతో ఇంతో వుంటుంది. అంటే, పేర్లు వాళ్ళ ఫ్యూచర్ నిర్ణయిస్తాయని అనట్లేదుగానీ, వాటి ఇన్‌ఫ్లూయెన్స్ వుండి తీరుతుందని నా నమ్మకం. కాబట్టి అర్థంలేని పేర్లని, సందర్భం లేకుండా ముందునించీ పెట్టుకోటం బొత్తిగా మంచి పని కాదు. పాపాయి పుట్టాక వాణ్ణి చూడగానే, మనకి తట్టాలి పేరు. ఉదయాన్నే పుడితే 'ఉష' అనో, అందంగా నవ్వితే 'సుస్మిత' అనో మనకి పెట్టాలన్పించి తీరుతుంది. అలా మంచి భావం, అర్థం, లేదా మంచి గొప్పవాళ్ళ పేరో అప్పడనుకుని పెట్టాలిగానీ ఇలా అలమార్లోంచి తీసి పుట్టగానే తగిలించడంకాదు.

అందుకే మీ వాళ్ళంతా ముందు నీ సలహాలడిగినా, తర్వాత వాళ్ళకి సహజంగా కలిగిన ఇన్‌స్టింక్ట్‌వల్ల వాళ్ళకి నచ్చినపేర్లు సొంతంగా పెట్టుకోటం జరిగింది. అలా అని చెప్పక, ఏవేవో సాకులు చెప్పేవాళ్ళు. పేర్లలో సలహాలుండవు నీరజా! అది పేరెంట్స్ సొత్తు ..., ఎవరి సలహాలూ అవసరంలేదు, కాదు గూడా! ఎవరైనా ఎపుడైనా పేరు సజెస్ట్ చెయ్యమని అడిగితే, బోల్తాపడిపోకు, నమ్మకు. వాళ్ళు కేవలం నిన్ను ప్లీజ్ చేసేందుకడుగుతున్నారనీ, వాళ్ళు ఎపుడో ఏదో నిర్ణయించేసుకుని వుంటారనీ మర్చిపోకు. కాబట్టి ఇంకా పుట్టని మన పిల్లలకి 'పేర్లు' అంటూ ఇప్పట్నించీ బుర్ర పాడుచేసుకోకు. తీరా నాకు నచ్చకపోతే డిసప్పాయింట్ అవుతావు..." అనేసి ఊపిరి పీల్చుకున్నాడతను.

నీరజ నోట్లోంచి మాటలేదు. చివరికీ అవకాశంకూడా ... సరే అన్నమాట ... "ఎంత అన్యాయం" ఆక్రోశించింది నీరజ మనసు.

పాపం నీరజ! కదూ?